ఎం.బి.జనార్ధనరావు

# రతిపాటలు



బావామరదళ్ళ సరససల్లాపాలు

&

సామాజిక సమస్యలపై ప్రశ్నించిన అగ్గిదివిటీలు

KKM PUBLISHERS

# రత్తిపాటలు

బావామరదళ్ళ సరససల్లాపాలు

సామాజిక సమస్యలపై ప్రజ్వరిల్లిన అగ్గిదివిటీలు

రచయిత

ఎం.బి.జనార్ధనరావు

K K M
PUBLISHERS

# రత్తిపాటలు (రచనాకాలం : 1974)

తృతీయ ముద్రణ : 2016 మార్చి
వెల : 35/-

కవర్‌పేజీ : జావేద్
లే అవుట్ : భరత్ కుమార్
డిటిపి : కె.కె.ఎం. గ్రాఫిక్స్

**ప్రతులకు :**
అన్ని నవచేతన బుక్‌హౌస్ (తెలంగాణ),
విశాలాంధ్ర బుక్‌హౌస్(ఆంధ్రప్రదేశ్)లలో లభ్యమగును.
**కె.కె.ఎం.పబ్లిషర్స్,** న్యూస్ తెలుగు నెట్‌వర్క్, నాగోల్, హైదరాబాద్-68.
ఫోన్ : 8885458110
కాంటాక్ట్ మెయిల్ : newstelugu2012@gmail.com

**ప్రింటింగ్**
**నవచేతన ప్రింటింగ్ ప్రెస్**
12-1-493/1VA,
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్-500068.

**కాపీరైట్: కె.కె.ఎం. పబ్లిషర్స్, న్యూస్ తెలుగు నెట్‌వర్క్, నాగోల్, హైదరాబాద్**



## నా పాటలు... రత్తిపాటలు

నా రత్తిపాటలు కనబడకుండా పోయినప్పుడు అనేక మందిని 'ఏమండీ నా రత్తిపాటలు పుస్తకం కాపీ వుందా' అని అందర్నీ అడిగాను. 'లేదయ్యా' అంటూ అందరూ అన్నారు. ఒకేఒక్కరు మాత్రం 'జనార్ధనా...నా దగ్గర వుంది' అని అన్నారు. ఆయనే కుయ్యేరు (తూర్పు గోదావరి జిల్లా) మునసబు గారు శ్రీ నందికోళ్ళ సత్యసూర్యనారాయణ గారు. అందుకే ఆయనకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

నా ప్రాథమిక గురువుగారు అయిన దువ్వూరి నాగేశ్వరశర్మ గారికి, మేము చదివిన కాలేజీలో లెక్చరర్‌గాను, కవిత్వంలో అనేక మెళకువలు చెప్పిన గురువు గారైన డాక్టర్ అద్దేపల్లి రామ్మోహన్‌రావు గారికి కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకుంటున్నాను. అలాగే నేను చెపుతుంటే తను రాసుకుపోయే వాడు, అతను మా పెద్దమ్మ గారి అబ్బాయి రామకృష్ణ సాయి. వాడికి కూడా నా కృతజ్ఞతాభివందనాలు.

రత్తిపాటలు రాసిన కాలం 1974 నుండి 1977 వరకు అందువల్ల పాటలను ఆనాటి సామాజిక పరిస్థితులకు అన్వయించగలరు. ఇప్పుడంతా ఇంటర్నెట్ కాలం. ఇలాంటి పాటలు ఎవరు చదువుతారని అనుకునేవాడ్ని. కానీ ఇలాంటి పాటలు కూడా చదువుతారని నిరూపించారు కూన అజయ్‌బాబు గారు. చీకట్లో కన్పించిన చిరుదివ్వె ఆయన. ఆయన విశాలాంధ్రలో న్యూస్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కాలంలో(2010) ఈ పుస్తకంలోని కొన్ని పాటలను ప్రచురించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత నా రత్తిపాటలు పుస్తకం తెరమరుగయిందని అనుకుంటున్న రోజుల్లో కూన అజయ్‌బాబు గారే మళ్లీ నాకు ఫోన్ చేసి ఈ పుస్తకం నేను ప్రింట్ చేయిస్తానని చెప్పి నాకు షాక్ తినిపించారు. అసలు ఆయన ఎందుకు ఈ పుస్తకంపై ఆసక్తి చూపారో నాకు ఇప్పటికీ తెలియదు. ఆయన స్వయంగా రత్తిపాటలు పుస్తకం మొత్తాన్ని

డిజిటలైజ్ చేసి ఇంటర్నెట్‌లో పెట్టారు. ఫేస్‌బుక్‌లో ఒక రోజు ఈ పుస్తకాన్ని అప్‌లోడ్ చేయగానే ఒకేరోజు 5000 మందికిపైగా విజిటర్స్ ఈ పుస్తకాన్ని చదివారని చెప్పగానే అందరం షాక్ తిన్నాం. ఈ పాటల్లో 'రసం' ఇంకా చావలేదని రుజువైంది. ఆ తర్వాత 2016 మార్చిలో అజయ్‌గారు ఈ పుస్తకాన్ని ప్రింట్ చేయించారు. నిజానికి ఈ పుస్తకాన్ని ఎవరు ప్రింట్ చేశారో, ఎందుకు చేయించారో నా చేతికి పుస్తకం ఇచ్చేదాకా ఆయన కూడా నాకు ఇంతవరకు చెప్పలేదు. కాకపోతే పుస్తకం మాత్రం ప్రింట్ చేయించి నా చేతికి ఇచ్చారు. జీవితంలోని ఆఖరి అంకంలో ఈ పుస్తకం చూస్తే మీకు కచ్చితంగా ఆనందంగా వుంటుంది. అందుకే ప్రింట్ చేయించాను అని అన్నారు. అందుకే ఈ పుస్తకానికి మరోసారి ప్రాణం పోసిన అజయ్‌బాబుగారికి ధన్యవాదాలు ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. సినిమా పాటలు రాయాలనుకునేవారికి, ఇతర సరస గీతాలు రాయాలనుకునేవారికి ఈ రత్తిపాటలు కచ్చితంగా ఉపయుక్తమవుతాయి. ఇది గొప్ప సాహిత్యం కాకపోవచ్చు. కానీ మనసుకు ఉల్లాసం కలిగించే మంచి భావగీతికలు అని మాత్రం చెప్పగలను. అలాగే పల్లెజీవనంలో సామాజిక సమస్యలపై ప్రజ్వరిల్లిన అగ్గిదివిటీలు కూడా. ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

**రచయిత**
**ఎం.బి.జనార్ధనరావు**



## రచయిత వివరాలు

పేరు : ఎం.బి.జనార్ధనరావు

జననం : 18-03-1955

ఊరు : కుయ్యేరు,
తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

నివాసం : మధురానగర్, 4-82, కాకినాడ-4
తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

చదువు : బిఎ

తొలి రచన : రత్తిపాటలు

తదుపరి రచనలు : సిరిమువ్వల చిరుసవ్వడి,
హిమసుమాలు, ప్రత్యూష

తల్లిదండ్రులు : మంచెం లోకేశ్వరరావు, కుసుమ

సంతానం : విజయలక్ష్మి, ఎం.ఎస్, ఆటోమొబైల్, యుకె
శ్రీకాంత్, బి.టెక్, ఐటి, ఎంబిఎ

భార్య : శ్రీదేవి

మొబైల్ నెంబర్ : 9618601306

**రచయిత నాడు - నేడు**



# రత్నాలమూట

**శ్రీ జనార్దనరావు గారికి నమస్కారాలు**

మీరు పంపిన 'రత్తిపాటలు' పుస్తకం అందింది. ఆమూలాగ్రం చూశాను. ఇందులో గ్రంథగతమైన సాహిత్యం బాగుంది. ఇందులో వస్త్వైక్యం వుంది. పలుకుబళ్ళు సర్వేసర్వంతా జానపదమైనవనలేను కానీ చాలావరకు జానపదాలకు నుడికారానికి దగ్గరగానే వున్నాయి. గ్రాంథిక భాషకు దూరంగా ఉన్నా దీనిలో ప్రత్యేక మాండలికమన్న ముద్ర వేసే వీలు కనిపించదు. తూర్పుగోదావరి కంటే విశాఖ పలుకుబడి ఎక్కువనిపించింది. మీరు ఆడమనిషికి రత్తి అని పేరుపెట్టారు. కానీ మగవాడు కేవలం 'మావ'గా మిగిలిపోయాడు. నండూరి ఎంకికి నాయుడుబావలాగా ఇక్కడా ఒక పేరు పెట్టగలరేమో! 'రత్తికి రాయుడు' సరిపోతుందా? రాయుడు అనగానే ఆ పదానికి అనుసంధింపబడే సామాజిక స్వరూపం అన్యం రావచ్చునా? ఆ విషయం మీరు ఆలోచించవచ్చు.

ఇవి పాటలు మాత్రమే కాదు. పాటలు కూర్చిన కథ! ఈ కథలో ఓ పల్లెపడుచు ఈడు వచ్చినప్పుడు ప్రియుణ్ణి? ఎన్నుకొని పెద్దల అడ్డంకుల్ని అధిగమించి వివాహోత్పూర్వం ముగ్ధ ప్రణయాన్నీ, అనంతరం ప్రౌఢ ప్రణయాన్నీ అనుభవించింది. ఆ పైన మాతృత్వ కాంక్షను ప్రోది చేసుకున్నది. తాను, తన మావ ఇద్దరు కాదని ఒక్కరేనని స్థిరీకరించుకున్నది. సుఖంలో దుఃఖమూ, దుఃఖంలో సుఖమూ కలగలుపుగా అనుభవించి కరువు రాకాసి తమ పల్లె బ్రతుకుల్లో చీకట్లు చిమ్మగా రవ్వంత వెలుగు కోసం ఓపిక పట్టి ఎదురుచూసింది.

ఇక్కడి నుండి రచయిత 'రత్తి'గా పరకాయ ప్రవేశం చేస్తున్నాడు. అంతకుముందు రత్తి ప్రణయభావనను అనుభవించడంలో తటస్థంగా, కాల్పనిక



లక్షణాన్ని అనుసరించి ముందుకు సాగిన రచయిత ఈ దశలో తటస్థంగా ఉండలేకపోయాడు.

ఈకాలంలో పల్లెల స్థితి ఎట్లావుంది? పెత్తందారీతనం విచ్చలవిడిగా రాజ్యంచేసే కాలం! బడుగు రైతులు బిక్కచచ్చిపోతున్న కాలం! ఈ కాలాన్ని మార్చడానికి ఏం చెయ్యాలి? అసలు మనిషంటే ఎట్లా ఉండాలి? దేవుడంటే ఎవరు? రాయా రప్పా? వాడు గొప్ప వాళ్ళ కొమ్ము కాచి పేదవాళ్లను అణగదొక్కాడు. వాడికి పూజలెందుకు, గుడులెందుకు? ఆకలితో మనుషులు డొక్కలు మాడి, చేవచచ్చి, అణగారిపోతుంటే మనం 'ఆడిని' నమ్ముకుంటే ఒరిగేదేముంది?

ఇట్లా రచన సాగిన చోట రచనా గమనం నుంచి రత్తి జారిపోతుంది. రచయిత ప్రత్యక్షంగా పేజీలలో సాక్షాత్కరించసాగాడు. అతనిలోని 'విప్లవాత్మక' గొంతు విప్పసాగింది. రాళ్ళకు మొక్కి, చుక్కేసి తొంగుంటే సూరీడు రాడు...రంగులకలలో బతికేయబోకు గొంతెత్తు! నిజమేమిటో చెప్పు! చితిపేర్చి చింతలను కాల్చు! బ్రతుకుల్ని వెలిగించు! అంటూ రత్తిగా పరావర్తనం చెందిన రచయితే ఆకాశాన్నంటేట్లు కేకలు పెడుతున్నాడు. కనుచూపు దూరాన కనపడుతున్న ఎర్రని సూరీడు ఎదురెక్కుతున్నాడు. ఇక గండాల గుండాలుండవు. బాధల బంధాలుండవు. ఏడుపుల ఏటిని ఈది సుఖంగా ఉంటాం. దినదినమూ ఇక మనకు దివ్వెల పండగే! ఇది ఈ రచయిత ఆశ, ఆకాంక్ష కూడా! రచయిత రత్తిలో నుండి బయటకు వచ్చేశాడు. నాకు చూడగా ఈ సంపుటి రెండు ఉద్విగ్న భావాలకు చెందిన పాటల కొలువు! ఒకటి ప్రణయానికీ, మరొకటి విప్లవానికీ చెందిన ఆలోచనా ధార! అందుకు రచయిత సృష్టించిన రత్తి ఒకదానికి కర్తృత్వం వహిస్తే, సాక్షాత్తూ రచయితే మరోదానికి కర్త! ఇది ఈ గ్రంథానికి సంబంధించిన విలక్షణత. ఈ రెంటికీ కథ అనే సూత్రం ద్వారా అనూహ్యంగా స్ఫూర్తిని రగిలించడానికి రచయిత చేసిన

ప్రయత్నం గుర్తించదగ్గదే! ఒక రకంగా ఈ ప్రయత్నంలో కొత్తదనాన్ని నేను అభినందిస్తున్నాను. ఈ పుస్తకానికి రత్తిపాటలు అనే నామకరణం కంటే, రత్తీ రచయితా అంటే మరింత సార్థకంగా ఉండేదేమో! శుభం!

హైదరాబాద్ **నాయని కృష్ణకుమారి**
08-06-2010 మాజీ వైస్ ఛాన్సలర్, తెలుగు యూనివర్శిటీ

---

## కత్తిలాంటి రత్తిపాటలు

సుతిమెత్తని రత్తిపాటల కవి జనార్ధనరావుగారికి నమస్కరిస్తూ, ఈ పాటలు హాయిగా వున్నాయి. వెన్నల రేయిలా వున్నాయి. ఎప్పుడో చదివిన నండూరి, బసవరాజు, కొనకళ్ళ మొదలైన వాళ్ళంతా గుర్తుకువచ్చారు. “కులమేటి మతమేటి కుళ్లు వెధవల్లారా అరచేతిలో పెట్టి పూజించు కూడా, మావకీ నాకు..వద్దు’ ఈ పంక్తులు మీ సామాజిక సమతత్వాన్ని వెతికి మీ వ్యక్తిత్వాన్ని తెలియజేస్తున్నాయి. మీ శైలి, మీ నుడికారం తెలుగుదనంతో వెల్లువెత్తింది. చక్కని మాత్రా చందస్సులో కత్తిలాంటి రత్తిపాటలు వెన్నముద్దల్లా జారాయి. నా మాటల్లో కంటే మీ మాటల్లోనే మీ పాటల ప్రత్యేకత వ్యక్తమవుతోంది. గుండెల్ని కుదపాలి. బండల్ని చదపాలి. గొంతుగొంతున మన పాట మారుమోగాలి.

మీ
**ప్రొఫెసర్ ఇండ్లూరి సుధాకర్**
*(ప్రస్తుతం రాజమండ్రి
తెలుగు యూనివర్శిటీ పీఠాధిపతి)*



## 1



**మావ:**

ఏవూరిసిన్నదో- ఎవ్వారి సిన్నదో
ఈడేరి వున్నది- ఇంచక్క వున్నది ॥ఏ॥

కొప్పేటి ముడిసింది- కోకేటికట్టింది
సూపేటి చూసింది -నడకేటి నడిచింది
సుడిగాలిలా నన్ను సుట్టపెట్టేసింది. ॥ఏ॥

ఎక్కడో చూసినట్టు- ఏదేదో వున్నట్టు
మనసేటో సెపుతాది- మనకేసి పోతాది
గుండెల్లో నాకు పాటేదో మెదిలింది. ॥ఏ॥

జనమ జనమల నుంచి - నా పెళ్ళామేమొ
సెప్పగలగే వారు - ఉన్నారో లేరో
కన్నులకు నాకు నిదరింకరాదు ॥ఏ॥

**రత్తి:**

సక్కనైనోడు - సల్లనైనోడు
ఈడితో జోడు కుదిరితే ఇంపు
ఈడి పక్కనె నేను నిలిసుంటె సొంపు
రూపు సూపులు సూడ- ఊపిరాడబోదు ॥స॥

ఈడిమాటలే పాటలై ఇనిపించుతాయి
ఈడుపాటలే పాడితే యింకెంత హాయి
ఆడి పలుకు ముందు- సిలకాలెందు కందు ॥స॥

నా కాలికి ముల్లు నాటుకున్నపుడు
ఆడి కళ్ళంట నీరు కారగాసూత్తి
ఆడి మనసు ముందు -ఎన్న ఎందుకందు ॥స॥

**రత్తి:**

గుండెల్లో ఒక మాట గూడు కట్టింది
గుక్క తిప్పకుండ గోస పెడతంది ॥గు॥

ఆడి తలపుల్లోన అలసిపోతుంది
ఆణ్ణి సూసేదాక ఆరాటపడుతుంది.
పాడినా పాటలో ఆడి పేరుంటాది
నిదరలో ఆ రూపె మెదలుతా వుంటాది ॥గు॥

కూకండలేను నుంచుండలేను
నిముసమైనాగాని కునుకెయ్యలేను
ఆడొచ్చి అడిగితే సిక్కొదిలిపోతాది
ఆడిసేయి తగిలి తేగ్గొదిలిపోతాది ॥గు॥

పూలకు పిట్టలకు ఊసు లొచ్చుంటె
ఈ కబురు ఆడికి మోసేసి ఉంటె
ఈ సింత వొదిలేసి-బతుకు
మలుపేదో తిరిగేది ॥గు॥

**మావ:**



మాట తీసెయ్యొద్దు
ఇసిరి కొట్టెయ్యొద్దు
నీకు నాకేటని



నిలదీయ వద్దు



నీపేరె పదముగా పాడు కొంటున్నాను
నీ రూపు కళ్ళలో దాసుకొంటున్నాను
నీతోటి బతుకే నిత్తెముం ఉండాలని
ఎయ్యిదేవుళ్ళకు నేను మొక్కుకుంటున్నాను సుమా
నీ సూపు నా సూపు కలిసింది మొదలు
నాగుండె గూడులో ఏసంగి గుబులు
ఈమాట సెపితే ఏటందువోనని
ఇన్నాళ్ళు ఆగేను ఇంకాగలేనె ॥మా॥
నేనంటే నీకు మనసున్నదంటే
చేతికి సెయ్యిచ్చి ఒక నవ్వు నవ్వు
నేనంటే నీకు కిట్టమున్నట్టయితే
నీ సేతితోనె యింత యిసమిచ్చి సంపు ॥మా॥

**రత్తి:**

నేనెటో ఎరగవు- నాపేరేటో ఎరగవు
నాపైన నీకింత మనసుండ తగదు ॥నే॥

కులము తక్కువ దాన్ని- సిరిలేనిదాన్ని
రత్తిపేరూదాన్ని -సెత్తి లేనిదాన్ని ॥నే॥

పొగరెక్కువంటారు- తెగటెక్కు అంటారు
ఊపిరి కొత్తరి- ఊసులకి కొత్తనె ॥నే॥

నోరిడిసి అడిగేవు - కాదనగలేను
వచ్చేటి ముప్పులకు -నేనేటి కాను ॥నే॥

**మావ:**

ఈ ఏల నామనసు-ఈ మాపమైనది
ఆకాశ మంచులా తెగ తిరుగుతున్నాది ॥ఈ॥
కులమేటి మతమేటి- ధనమేటి బలమేటి
మనసులూ కలిసేక మనకింక అడ్డేటి ॥ఈ॥
నా రత్తంలో రంగువి నీవే
నాగుండెల్లో సప్పుడు నీవే
నిన్నొదులు కుంటానా?
నను సంపుకుంటానా? ॥ఈ॥
ఏ ముప్పు లొచ్చినా ఎదురీదగలను
ఏ అడ్డు లొచ్చినా ఎగిరేయగలను
పక్కన నువ్వుంటె పరమేసు దున్నట్టె
ఒక్కరికి నేనింక ఓడేది లేదు. ॥ఈ॥

**రత్తి:**



కలతెందుకురా - కళ్ళ నీరెందుకురా
ఎవరేటి అన్నారు - ఏ సిచ్చ నేసారు
సెప్పురా నాతోటి సెప్పురా ॥క॥
సుకములోనా నీవె- కట్టాలలో నీవె
రెంటిలో నీతోనె- కలిసి వుంటానురా ॥క॥
నీగుండె నాకాడ- దాసుకో వద్దురా
నా బతుకు నీ బతుకు- ఏకమైనాదిరా ॥క॥



**మావ:**



ఏటనీసెప్పనేరత్తి
ఏలాగ సెప్పనే
కన్నతల్లే నన్ను కాదు పొమ్మన్నాది
నీతోటి నాపెల్లి సెల్లదన్నాది
నే నేటి సెప్పినా ఒప్పుకోనన్నాది
నాకడుపు పట్టుకొని నొక్కకన్నాది ॥ఏ॥
పదినెల్లు మోసాను
పాలిచ్చి పెంచాను
లోటేటి లేకుండ పెద్దోడి వైనావు
ఈనాడు నామాట కొట్టవద్దన్నాది ॥ఏ॥
మాట కొట్టిన ఎడల మాటాడ వద్దంది
ఏమాటా సెప్పరా ఒకరోజు గడువంది. ॥ఏ॥

**రత్తి:**

ఈమాటకేయింతదిగులా మావా
నీగుండెలో యిన్ని సెగలా మావా
కన్న తల్లిని నువ్వు కలత పాల్సెయ్యొద్దు
నమ్ముకున్నదాన్ని నట్టేట దింపొద్దు
గుట్టుగా కొన్నాల్లు ఉండు
ఒట్టుగా మనకలలు పండు
ఎండల్లు కాత్తాయి- వానల్లు వత్తాయి
కాలంలో మారుపుల కెరటాలె లేత్తాయి ॥ఏ॥

కాదన్న మీ అమ్మ కట్టుయాటూ మనిసి
ఔనన్న నీ మనసుకు పేమంటే తెలుసు
కులాలు పోతాయి- మతాలు పోతాయి
నీ అమ్మ మనసులో పేమగా లేత్తాది. ॥ఏ॥

**2**

**రత్తి:**



సలి మంటకాడ
పదిమందిలోన
కనుగీటినా వేటిరో
మావ పరువేటి కావాలిరో
మావ పరువేటికావాలిరో
ఊరంటే ఏటిరా- నోరెట్టి పడతాది
ఇంతంటె అంతని- ఇంతగా సెపుతాది ॥ఊ॥ ॥స॥
పేమంటె ఏటో - పేమ జంటెరుగురా
ఎరగలే నోళ్ళకి- పేమంటె పిచ్చిరా ॥ఊ॥ ॥స॥
పెళ్ళయ్యే దాక కొంత గుట్టుగా ఉండరా
పెళ్ళయ్యిపోతే మన కడ్డేటి ఉందిరా ॥పే॥ ॥స॥

**రత్తి:**

ఏకటాకీ చూడకు
ఎఱ్ఱోడి వవ్వకు
నాపేరే పాడకు
ఎల్లడిరా, వాడకు ॥ఏ॥



నిన్నంటి వుందునే ఏసేనం
నీకంటి యింటనే కాపరం
నీ ఊసులే నాకు ఊపిరి
నీతీపి తలపులే రేతిరి ॥ఏ॥
కూడు తినేటేల, కూలి చేసేటేల
కూకున్న ఏల, నిలుసున్న ఏల
నాగుండెల్లో నీవెపుడు నిలిసేవురా
గుండెల్లో గొంతెత్తి పిలిసేవురా! ॥ఏ॥

**మావ:**

కునుకు రాదేరత్తి కూడ దంటేను
కోక కొంటానే ఒప్పుకుంటేను
**రత్తి:**కొన్నాన కోకను? కట్టేన కోకను?
పెట్టావు లే వోయి మా గొప్ప లంచము
**మావ:**తిరము లేదే రత్తి తిప్పి కొడతేను
తిలకాన్ని కొంటాను ఒప్పుకుంటేను
**రత్తి:**కొన్నాన తిలకాన్ని? దుద్దేన నా నుదుట?
పెట్టావు లే వోయి మా గొప్ప లంచము
**మావ:**పగలు రాదె రత్తి పట్టనీకుంటేను
పట్టీలు కొంటాను ఒప్పుకుంటేను



**రత్తి:**ఏ యింటిగోడకు ఏసావు కన్నము
నాకొద్దు బాబోయి నీ దొంగనగలు
**మావ:**దొంగోడి నై తేను దోచి పారేత్తాను
దిక్కెవరే నీకు మొక్కవ్వరే నీకు

దిక్కెవ్వరే నీకు మొక్కెవ్వరే నీకు
రత్తి:దిక్కు మొక్కులు రెండు ఎదురున్న నీవు
ముట్టకూడదు నన్ను తెలిసింద మావ

**3**



## రత్తి:

ఒల్లో కూకుంటాడమ్మా!
ఎన్నో సెపుతుంటాడమ్మా!
కల్లకేసి సూత్తాడమ్మా!
కన్నుగీటి నవుతాడమ్మా! ॥ఒ॥
ముద్దొత్త ఉంటాడమ్మా!
ముద్దిత్తా నంటాడమ్మా!
వద్దన్నా ఇనుకోడమ్మా!
వాటేసుకు పోతాడమ్మా! ॥ఒ॥
రేయంతా నిదరోడమ్మా!
గోపాలుని అన్నోయమ్మా!
ఒల్లంతా సెమటే నమ్మా!
కనుగవ్వలు ఎరుపోయమ్మా! ॥ఒ॥
నవ్వింతా ఉంటాడమ్మా!
కవ్వింతా ఉంటాడమ్మా!
నా నోముల పంటోయమ్మా!
నే కోరిన జంటోయమ్మా! ॥ఒ॥



## మావ:

పున్నమి సెందరుడు
పచ్చని ఎన్నెల ॥పు॥
మల్లిపూలు ఎట్టుకోయే
మంచిగందం రాసుకోయే
తెల్లకోక కట్టుకోయే
తెల్లారులు మేలుకోయే



కొమ్మమీంచి కోయిలమ్మ కూసినట్టు
మబ్బుసూసి నెమలి పిట్ట ఆడినట్టు
వరిసేను పైరిగాలి కూగినట్టు
వరిసేను పైరిగాలి కూగినట్టు
లేగదూడ పాలు తాగి గెంతినట్టు
ఈ ఏల సందడి - ఈ ఏల సందడి ॥పు॥

## రత్తి:

మలాట సినిమాకి
మావ, మన మెలదామా? ॥మ॥
సైకి లద్దిడబ్బులు నాదగ్గిరున్నాయి
తొక్కేటి ఓపిక నీ దగ్గరున్నాది ॥మ॥
కోనసీమ తీసిరంట వానిస్రి ఉన్నదంట
నాగేసిరావేమో కుర్రగెంతి లేసిడంట
దారిలోన వానొత్తె గొడుగట్టుకొత్తాను
ఆలుకాడ అనకుండ ముసుగేసు కుంటాను

మాఇంటి కాడనైతె ఏదోటి సెపుతాను
పెద్దకాపు కళ్ళల్లో ఏకారం కొడతావో ||మ||

**మావ:**



మాయమ్మాకి జొరమని మడతేత్తాను
టిక్కెట్టు డబ్బులు నేనట్టుకొత్తాను
మలాట సినిమాకి ఎలిపోదామే-రత్తి
మోటారు నెక్కినట్టు ఎలిపోదామే.

**4**

**రత్తి:**

రాకురా రాకు -ఈ రేయి రాకు
కును కట్టుకున్న కుదురు లేకున్న
రాకురా రాకు- ఈ రేయి రాకు
వడంతా మనవరస పసిగట్టినాది
పసిగట్టి మనపైన పగబట్టినాది ||రా||

నువ్వొచ్చేటపుడు ఏ కన్ను కానిందో
నిన్ను నన్ను చూసి ఏ గుండెకాలిందో
ఏ గుడిసి సూసిన గుసగుసలే
ఏ మనిసి సూసినా రుసరుసలే ||రా||

కనకడేమొ నిదరొదిలి కాపు కాత్తడంట
నాగడేమొ దడి యెనక నక్కి సూత్తడంట
పట్టుపడిపోయేమో పకపకలే
తలెత్తుకోలేక యిసయిసలే ||రా||



**మావ:**

ఎఱ్రినా కొడుకిలకి ఏలాకోలమా
నీతోటి నాతోటి పంతాలా! ||ఎ||

బాణా కఱ్ఱ పుచ్చుకొన్నవా
బుఱ్ఱ సెక్కలయిపోతాది
చేత సెయ్యి కలిపినానా
ఎముకలు పిండైపోతాయి ||ఎ||

అలుమగలం కాబోతాం
ఆడుకొంటాం పాడుకొంటాం
అళ్ళకెందుకే మద్దిన ||ఎ||

**రత్తి:**



ఓరి ఎఱ్ఱి నా మామ
ఓ మాట సెప్పనా
పెళ్ళికా నోళ్ళము
తల్లి సాటోల్లము
గుట్టు బయలు కారాదు
పట్టుదలకు పోరాదు
సీకటి పడ్డాక రారా
నీ ఆకలి తీరుసురా మావ ||సీ||

సుట్టా గిట్టా కాల్చకురా
నిప్పునిన్ను సెప్పేను
నల్లబట్టలు కట్టుకురా
సీకటి నిన్ను కప్పేను ||సీ||

ఈడి దోవను రాకురా

కుక్కలు సూసి మొరిగేను
ఈలపాట పాడుమురా
సప్పున
నేను లేచేను



అత్తరు ఉంటే రాసుకురా
వాసన వలపును పెంచేను
పూల మాట మరువకురా
ఆటికి పడి సత్తాను ॥నీ॥

**5**

**రత్తి:**

నీసాటి నీవేరా
నీరూపు నీదేరా ॥నీ॥

తలపాగ సుట్టి
మేడితోక పట్టి
దున్నుతుంటే నిన్ను
సూసిందే కన్ను
రేకు రేకు రంగు పొంగే పువ్వురా నీనవ్వు ॥నీ॥

సెరువు గట్టుకాడ
మలిసందెయేల
దూళ్ళమేపే నిన్ను
మూసిందే కన్ను
బతుకు మొత్తం బానిస చేసే మోమురా నీమోము ॥నీ॥
ముంతని మూట గట్టి



కొడవల్ని సేబట్టి
కోత కెల్లే నిన్ను
సూసిందే కన్ను
గుండెమొత్తము పిండిచేసే తూవురా నీసూపు ॥నీ॥

**మావ:**

ఏ పాట పాడి నీరూపు సెప్పనే
ఏయింతోటి నిను నేను పోల్చనే ॥ఏ॥

ఇష్ణుమూర్తి ఈముడింటి కెల్లేడంట
అందమైన పిల్లవాడ చూసాడంట
"ఈ పిల్లకన్న మిన్న లేదు లేదోరన్నా"
అనుకున్నాడంట అన్నాడంట
ఇష్ణు; ఈసుడు బెమ్మింటి కెల్లిరంట
"అందమైన పిల్లెవర"ని బెమ్మనడిగిరంట
ఈసుడా మీ యింటి పిల్లకాదు
ఇష్ణువా, మీ యింటి పిల్లకాదు



బూలోక మందున్న రత్తిదే అందము
దానితో పోల్సానూ ఎవ్వరూ సాలరు
అన్నాడంట, రత్తి, ఇన్నావంటే
అన్నాడంట, రత్తి, ఇన్నావంటే ॥ఏ॥

**6**

**రత్తి:**

ఒద్దు నాయేపు సూడొద్దు

ఒద్దొద్దు నాఊసు తేవొద్దు
రెప్పన్నా ఏయికుండ
తలుపన్నా మూయకుండ
ఎలుగొచ్చేదాకా ఎదురు సూత్తిరా ॥ఒ॥
దేనింటి కెళ్ళినావో, దేని కాళ్ళు పిసికినావో
ఈ రత్తి నీకు గురుతుంటదా ॥ఒ॥
నగలేమి లేనిదాన్ని, వగలేమి పోనిదాన్ని
ఈ పిల్ల నీకు రుచులిచ్చునా ॥ఒ॥

**మావ:**

ఒద్దు అంతమాట అనవొద్దు
ఒద్దొద్దు గుండెల్లో పొడవొద్దు
కామందు రాసికాడ–కాపు కాయమన్నాడు
సాకు సెప్పబోతుంటె –రూక ముట్టదన్నాడు
ఈలు లేక మానినాను–తప్పయితే
సెమియించు ॥ఒ॥

**రత్తి:**



జాత రొచ్చింది; మావ
ఒంక దొరికింది
యిద్దరము కసితీర
రేయంతు సుడాలి ॥జా॥
గుండాట సుద్దాము
గరగాట సుదాము



బుడగల్ని కొందాము
కోయడాసుముకాడ కాసేపు ఉందాము ॥జా॥
పొట్లాలు తిందాము
రికాడ్లు ఇందాము
సొతకం సూద్దాము
అమ్మోరి గుడికాడ దన్నాలు పెడదాము ॥జా॥
పూనకం సూద్దాము
పానకం పోద్దాము
పల్లనీ తిందాము
లైటుల్లో మన రూపు మనసార సూద్దాము ॥జా॥

**మావ:**

సెలేమేదో దినమేదా సెప్పతేకున్నానని
జాతరొచ్చినంటె ఒప్పులేకున్నానె ॥సె॥



కూడుతింటున్నానొ
కునుకు తీత్తన్నానొ
మాటాడుతున్నానొ
పదమాడుతున్నానొ
నేనేటి ఎరగనే ॥సె॥
గడ్డికోత్తన్నానొ
గొడ్లు కాత్తన్నానొ
పొలమెల్ల తున్నానొ
పాటు పడుతున్నానొ – రత్తి
ఏ మందు రాసేవో ॥సె॥

ఏ మంత్రమేసేవొ
నువ్వేటి చేసేవొ
నీ ఊసె ఊపిరి - రత్తి
నీ ఊసె ఊపిరి ॥సె॥

**7**

**రత్తి:**



జాడలేదు - జాబులేదు
కంటిరెప్పలు కప్పుతున్నాయ్
కూడుమరిసి - జోడుతలిసి
గుడిసి దీపా లెలగకున్నాయ్ ॥జా॥

ఏటి చేసినా, అడేటి చేసినా
నాకు సెప్పక పోడు ఎప్పుడూ
ఎందునుండెనో, ఎందుకుండెనో
నాడు గుండెల బాద సప్పుడు ॥జా॥

డబ్బు జబ్బు ఎరగనోడు
ముండ రుసులు మరగనోడు
ఎందునుండెనో, ఎందుకుండెనో
నాడు గుండెల బాద సప్పుడు ॥జా॥

నన్ను మరిసి, నన్ను యిడిసి
సెనము బతకని మంచి మనిసి
ఎందునుండెనో, ఎందుకుండెనో
నాడు గుండెల బాద సప్పుడు ॥జా॥



సోది నడిగితె సెప్పునేమొ
కుదురు కొంత దొరుకునేమొ

**రత్తి:**

నాకళ్ళు పొరలేసె నింతకాలం
నా మావ చేసేదు ఎంత మోసం ॥నా॥

కోక పిచ్చి ఉన్నదని
రూక పిచ్చి ఉన్నదని
మాట మంచి సూపించి
మనుసు పిప్పి సేత్తాడని
అనుకోనే లేదు
అ, ఆలోసనే లేదు ॥నా॥

మనసాడికి లేదని
మమతంటే తెలదని
దొంగ నటన మాడేసి
దోసుకు పోతాడని
అనుకోనే లేదు
అ, ఆలోసనే లేదు ॥నా॥



కాలుజారి పోయేను
నట్టేటన మునిగేను
దొంగోడిని నమ్మేసి
తలకొట్టుకు లాభమేటి
బతుకంతా పోయే
బాదల పాలాయె ॥నా॥

**రత్తి:**

నా గాలికే ఆగలేనోడు
నా జోలికే ఎందుకురాడు ||నా||

ఏ మందు రాసినాదో-ఏ యిందు సేసినాదో
ఏమత్తు సూపినాదో-ఏ ఒత్తు లొత్తినాదో
సూరమ్మకి మరిగానాడంట- ||నా||
ఏ మాట కెదురాడేను- నేను-
ఏ లోటుసే సున్నాను! ||నా||
ఏబానం ఇసిరి నాదో-ఏరూపున ఆనినాదో
ఏ లంచమిచ్చి నాదో-ఏమంచ మెక్కి నాదో
గంగమ్మకి మరగినాడంట ||నా||
ఏ మాట కెదురాడేను-నేను
ఏ లోటు సేసున్నాను ||ఏ||

**మావ:**

రాయె నారత్తి నాదు సందిట్లోకి
రాకుంటె నీ మావ రాలిపోతాడు ||రా||
నీవుంటె ఏ పొద్దు ఎగిరెల్లిపోతాది
నువు లేనిపొద్దు ఏడిపించేత్తాది
నవ్వేటి దానవు, నవ్వించుదానవు
నా గుండె గంటను మోగించుదానవు ||రా||
నీతోటి నా నిదుర పయనమయ్యింది
నిదరతో కుదురుజోడు కూడింది



ఎండిపోతున్నాను మండిపోతున్నాను
కూడు తినకుండా కుమిలిపోతున్నాను ||రా||
పూలతోటెమొ పిలిసి నవ్వింది
ఆ నవ్వు నాకు బల్లెమయ్యింది
బాదించినా గాని బరియించినా
మూగోడినై పోయి మూల్గుతున్నాను ||రా||

**రత్తి:**



వచ్చావ మావ ఇన్నాళ్ళకు
గురుతొచ్చాన మావ ఇన్నాళ్ళకు
కంటి కగపడకుండ- కబురైన లేకుండ
ఎక్కడకు పోయేవు?-ఏటయ్యిపోయేవు? ||వ||
నమ్ముకున్నది ఒకతున్నదని
నిన్నిడిసి సెనము బతికుండదని
మరిసేపోయేవా-నువ్వు తెలిసేపోయేవా ||క||
కూడు తినకుండ -కునుకేయకుండ
ఎంతయ్యిపోయేనొ-కనపడత ఉన్నాన! ||క||
ఎందుకెల్లేవసలు యిపుడైన సెప్పు
సెప్పుకున్నట్టయితె ఇకపైన రాకు
నేనేడిత్తె నీకు-ఏడుకా సెప్పు! ||క||

**రత్తి:**

నవ్వుకో నవ్వుకో నవ్వు నవ్వుకో
నాకాడ నవ్వకు, ననుసూసి నవ్వకు ||న||

సూసుకో సూసుకో సూపు సూసుకో
నాకేసి సూడకు, నాసూపు సూడకు ॥సూ॥
ఆడుకో ఆడుకో, ఆట ఆడుకో
నా కాడ ఆడకు, నాతోటి ఆడకు ॥ఏ॥
ఏడ్సుకో ఏడ్సుకో ఏడుపు ఏడ్సుకో
నాకాడ ఏడకు, నాకుపడి ఏడకు ॥ఏ॥

**మావ:**

ఏటేటి? ఏటి? ఇదేటి
ఈ యింతైన యింతేటి? ॥ఏ॥
ఎవరెరువు ఇచ్చేరె ఈ కోపము
ఏ ఎదవ పన్నేనె కుట్ర
ఇది నా రత్తియేనా? ఇది నా నెత్తురేనా? ॥ఏ॥
నేనెప్పుడు సూడలేదె ఈ రూపం
నేనెరిగి సేయలేదె ఏ పాపం
ఎంతేసి మాటలు- ఎన్నేసి ఈటెలు ॥ఏ॥
ఎట్టైన చూసేవ నీకంట
ఎందుకు రగిలింతావీ మంట
నువుదక్కకుంటె రత్తి- నాకు దక్కుసులేమిత్తి ॥ఏ॥

**మావ:**

తగ్గించు తగ్గించు తాపాన్ని
ఉత్తినే పెంచుకోకు పాపాన్ని ॥త॥
అనుకోనీ పైనమైతినే-అమ్మతో
అనుకోనీ పైనమైతినే



పైనముతో అమ్మమనసు మారినాదే
అమ్మనోట పెళ్ళిమాట పలికినాదే ॥త॥
మన పెళ్ళి ఎప్పుడో సెప్పవే- రత్తి
పెళ్ళి ఎప్పుడో సెప్పవే
కలలన్నీ పండించే కలిమానమే
కంగారు కంగారుగున్నదే! ॥త॥

**8**



**రత్తి:**

పూరకుక్కల్లార -కాటి నక్కల్లార
మీతోటి పనియేటి- మీరు నాకేంటి
నా మావ నాకు-మావకి నేను
రత్తాన్ని సైతం రత్తి కిత్తాడు
రత్తి లేదంటే సచ్చిపోతాడు
కులమేటి మతమేటి కుళ్ళి ఎదవల్లారా
అరిసేతిలో పెట్టి పూజించుకోడా ॥పూ॥
మావతో మనువు ఎన్నాళ్ళనోవా
మావ చెంతనె నాకు సొరగాలు లేవా,
మనసు తెలియని మీరు మనసులే కారు
మనసులైతే మీకు యీ బుద్ధులేరావు ॥ పూ॥
పేమ పెళ్ళికి మీరు పుల్లెయ్య బోతారు
పెళ్ళి సెడిపోతే మేలు మేలంటారు
ఎదవల్లారా మీరు ఆపలేరీ పెళ్ళి
మావకి నాకు బేమ్మడే వద్దు

**మావ:**



రతనమంటి రత్తి-రాయికే దక్కింది
రాయినే రాయుడని -నోరార పిలిచింది
సేమంతిలాగ- సిరిమల్లెలాగ
గుడిసంత గుప్పున - యింపు నింపేసింది
వూరు వాడంత -ఒక్కటయినాగాని
నోరుమూసినాకె-పెళ్ళమయి పోయింది ॥ర॥
ఏదేవి వరమొ- ఏనోము పలమొ
నాబతుకు కింతటి- సొంపు దక్కేసినాది
కులాలు మతాలు- అడ్డొచ్చినా గాని
కుళ్ళి ఎదవల నోళ్ళు- నొక్కుకున్నాగాని ॥ర॥

**మావ:**

ఈ కొత్త సిగ్గులేటి?
ఆ యెర్ర బుగ్గలేటి?
పచ్చగడ్డి పరుపుమీద
తొలిరేయి గడిసేనని
మరిసేవా ? ఏటి? ॥ఈ॥
ఒకలుపైన ఒకలుపడి
వందలసార్ల లిసేమని
మరిసేవా? ఏటి? ॥ఈ॥
తలుపు సందుల దూరి
ఎవరైనా సూత్తారని
తలిసేవా? ఏటి? ॥ఈ॥
మంచం కిందెవరైనా



నక్కి కూకున్నారని
తెలిసేనా? ఏటి? ॥ఈ॥
పెళ్ళయిన పెతిపిల్ల
సిగ్గువొలక పోయాల
అనుకున్నావా? ఏటి? ॥ఈ॥
సిగ్గువొత్తె సాలులే
బుగ్గ లెర్రబడతాయని
ఆలోసనా? ఏటి? ॥ఈ॥

**రత్తి:**

సుక్కలూ సెందురుడు
సూడొచ్చె మన సరసం
సిగ్గొదిలి పెట్టేసి
రెప్పల్ని కట్టేసి ॥సు॥
పరులకేళి సూత్తమంటె
అళ్ళికి బలే ముచ్చట్లు
ఆరుబయట పడుకుంటె
తప్పవులే ఈ పాట్లు ॥సు॥
గుడిసిలోన దూరితే
దుప్పటొకటి కప్పితే
సూడవురా ఏ కళ్ళు ॥సు॥
నీ ఇట్టంరా రేయల్లా



**రత్తి:**

దడి యెనక నేను
తానమాడు తుంటే

సలిసీమ లాగొచ్చి
తొంగిసూత్తాడు
మావ పొంగిపోతాడు
తానమాడి నేను
కోక కడుతుంటే
ఏమెరగనట్టే
దగ్గిపోతాడు
మావ తగ్గిపోతాడు
తలదువ్వి నేను
కొప్పు సుడుతుంటే
కొప్పులో మందారం
ఎట్టిపోతాడు
మావ మొట్టిపోతాడు
సాపేసి తొంగుంటే
సరసకొత్తాడు
సరసకొచ్చిన మావ
సరసాలు పోతాడు
సంబరం సేత్తాడు



**రత్తి:**

కొసరొద్దు కసరొద్దు
ఈరేయికింక ఇసిగించవద్దు
కోడికూత్తన్నాది
నిదరవత్తాన్నాది
పగలంత నీవు పాటడిపోతావు





రేయేమొ నాతోటి యుద్దానికొత్తావు
ఎంత ఓపిక నీకు- ఎరువియ్యరా నాకు ||కొ||
ఒళ్ళంత నీకు వలపు సెగలేమొ
నినుతాకితేసాలు చలి సచ్చిపోతాది
ఎంత రసికుడవోయి - నాబతుకంత హాయి ||కొ||
మనకొక్క కొడుకు ఎపుడు పుడతాడొ
పుట్టిన కొడుకుఎంత టోడవుతాడో
సెప్పరా ఓ మావ - పాడతానిక జోల



**మావ:**

సెనసెనము దిన దినము
తేటపడతన్నాది నీ అందం ||సె||
తేజమవుతున్నాది నీ అందం
నీ పైట గాలికే
పచ్చనగుతున్నాది వరిసేను
నీలోని హాయలాలికే
మెలితిరుగుతున్నాది సెలయేరు ||సె||
నీకొప్పు కోసమే
పూలు పూత్తన్నాది సేమంతిమొక్క
నీమెప్పు కోసమే
కూత కూత్తన్నాది కోయిలపిట్ట ||సె||
నీ నడక సూడగా
హంసలొత్తన్నాయి అకాశమంటే
నీ పాట పాడగా
ఎదురు సూత్తన్నాయి ఈ యిస్వమంతా ||సె||

**రత్తి:**

సెడ్డ సిగ్గుగా వున్నాది
దొడ్డసిక్కొచ్చీ పడ్డాది ||సె||

పెంకికాకి రక్కిందని సెప్పుకోనా?
సేతి గాజు గీసిందని సెప్పుకోనా?
నా బుగ్గమీద కాటుకి ఏ బొంకు బొంకను
అడిగేటోళ్ళ కళ్ళలో నేను ఏకారం కొట్టను ||సె||

తుమ్మసెట్టు గీసిందని సెప్పుకోనా?
దెయ్యమొచ్చి గీరిందని సెప్పుకోనా?
నా బుగ్గమీద కాటుకకి ఏ బొంకు బొంకను
అడిగేటోళ్ళ కళ్ళలో నేను ఏకారం కొట్టను ||సె||

**రత్తి:**

నామాటె సెపుతావు- నను మెచ్చుకుంటావు
నీవేటానీ వెరగవా నీవు సీకట్లో ఎలుగెలగవా ||నా||

సుక్కలు నీకొరకు ఉచ్చుల్ని ఒగ్గాలి
సెంద్రుడు నీకు సలాము సెయ్యాలి
నీఠీవి సూసి పులులదిరి పోవాలి ||నా||



నీ సురుకు ముందు మెరుపోడి పోవాలి
పెదకాపు నీయందు పాలేరు లాటోడే
గోవులకు నీవు గోపాల కిట్టుడవే
ఎదవలకి తప్పు అందరికి ఇట్టుడవే
నీరత్తి గుండెల్లో కొలువున్న దేవుడవే ||నా||



**9**

**రత్తి:**

ఎల్లిపోతుంది- దొర్లి పోతుంది
దొల్లెల్లిపోతుంది-మల్లి రా నంటుంది
పుట్టినా ఒకలాగే- సచ్చినా ఒకలాగే
గడిసిన గతంలో- మల్లెపూలున్నాయి
వత్తున్న రోజులు-నిప్పులా గున్నాయి
కీడైతే ఒకలాగే- మేలైన ఒకలాగే



నిన్న నవ్విన పువ్వు-నేడు రాలింది
పువ్వులా మానవ్వు- నిప్పు కాలింది
కీడైతే ఒక లాగే- మేలైన ఒక లాగే
ఆట పాటలు తప్ప- ఏ మెరగ నోళ్ళము
ఆకలికి సిక్కేము - అల్లాడుతున్నాము
కీడైన ఒకలాగే- మేలైన ఒకలాగే ||ఎ||

**మావ:**

ఏల వచ్చెనమ్మ- కరువు ఏల వచ్చెను
పంటలన్నీ పండగా ఏల వచ్చెను
మాయదారి కరువు ఏల వచ్చెను
ఏల వచ్చెను- ఏల వచ్చెను
మానెడు బియ్యం మూడు రూపాయలెల్లాగమ్మెను
ముడతలుకోక ముప్పైరూపాయ లెల్లాగయ్యెను
ఈసురు మిరప ఇరవైరూపాయ లెల్లా గమ్మెను
కుంకుడుకాయలు కుంచం ఐదు ఎల్లాగయ్యెను

సెక్కరగుండ బెల్లంముక్క సేతికందకుండెను
సమురు సుక్క సింతపండు కంటికానకుండెను ॥ఏ॥

పండిన పంటను గాదినదాత్తే
లంచం మరిగి నాయంసత్తే
కళ్ళకు సీకటి గంతలు కడితే
నీతికి కడుపులో మంటలు పుడితే
అలావచ్చె నమ్మ కరువు అలావచ్చెను
అలావచ్చెనమ్మ కరువు అలావచ్చెను



**మావ:**

భూమిదున్నేము-నారు నాటేము ॥భూ॥
కూడేది కూలోడికి-రత్తి- జాలేటి కామందుకి ॥కూ॥
నీరుతోడేము-కలుపు తీసేము ॥నీ॥కూ॥
కోతకోసేము- కుప్పనేనూర్చేము ॥కో॥కూ॥
రాసిచేసేము-గాది నింపేము ॥రా॥కూ॥
ఎండ ఎండేము-వాన తడిసేము ॥ఎ॥కూ॥
సెమట కురిసేము- సిక్కిపోయేము ॥సె॥కూ॥

**మావ:**

కాడిమీది మేడినాది ఎద్దులార
గడ్డిమీకు గంజినాకు ఎద్దులారా
ఎద్దులార ఎద్దులార ॥నా॥
గట్టుమీద గొడుగునీడ కామందు
గయ్యిమంటు కయ్యిమంటు.....



మట్టితోన మట్టిలోన మనముందు -
ఏడలేక నోరుమూసి.....
కంతిగాసి మీమెడలు - కడుపు నుండి మా బతుకులు
దిక్కులేదు మొక్కులేదు - రచ్చించే దాతలేదు
మీబాదలు మీగాదలు - నోరుంటే సెప్పుదురేమొ
నా బాదలు నా గాదలు - నోరుండి సెప్పలేము ॥కా॥

**రత్తి:**



పొద్దుతోటేపాటు- పొలమెల్లిపోయి
పొద్దుకూగేదాక-అడుండిపోయి
సెమపడిన గాని-సెమటూడ్సినాగాని
పొట్టనిండేదేది మామ-పొయ్యిమండేదేది మావ
రేపుకోసం మనము- సూపు సూత్తాము
రేపొచ్చి మనబతుకు - దిగులు సేత్తాది
రేపొచ్చి మనబతుకు -దిగులు సేత్తాది
రేపు సూపులు మనకు-ఎన్నాళ్ళు మావ
మన బతుకులకింక- సుకాలు రావ? ॥పొ॥

**రత్తి:**

రెక్కల్లో సత్తువ -డొక్కల్లో ఉంటాది ॥రె॥
డొక్కలే మాడితే
ఇంకెక్కడుంటాది-సత్తు వింకెక్కడుంటాది ॥రె॥
నీరున్ననారు పచ్చగుంటాది
సమురున్న ఒత్తు ఎలుగుతుంటాది

నీరేయకుంటే నారెండిపోతాది
సమురేయకుంటే ఒత్తారిపోతాది ॥రె॥
దేనికై నాగాని అద్దొకటి ఉంటాది
ఈ అమాస సీకట్లో పొద్దెపుడు పుడతాది
కాల్లిరిసి నడమంటే కల్లోడిసి సూడంటే
ఏ మనిసి సేత్తాడు నే నెక్కడినలేదు ॥రె॥
సిచ్చపడాలంటె తప్పొకటి సేయాలి
తప్పేటి సేయందె సిచ్చేల వేయాలి
కన్నొడిసె సీకట్లో కరినాగు వాకిట్లో
ఎన్నాళ్ళు నిలవాలి నే నిలవలేను ॥రె॥

**రత్తి:**

ఏటిసెప్పను నేను నామావకు
ఎలా సూడను నేను నా మనను ॥ఏ॥
నా ఒళ్ళు కందితే సూడలేనోడికి
నా మనసు నొచ్చితే ఉండలేనోడికి ॥ఏ॥
కలనైన కనలేని కతనైన ఇనలేని
దారునం జరిగింది దహనమయిపోయేను ॥ఏ॥
పనిలోకి రమ్మని పైట కొంగట్టుకుని
నా పైన పడ్డాదు నరకాన నెట్టేడు ॥ఏ॥
పై నున్న దేవుడికి పగ బట్టెనేమో
కామందు రూపనా కాల్చిపోయేడు ॥ఏ॥
సంపేటి సత్తాన్ని సెప్పేటికన్నా
సత్తాన్ని గుండెల్లో సంపటమే మేలు ॥ఏ॥



**మావ:**

బగ్గుమనే మంటలు -బగ్గు బగ్గుమనే మంటలు
కూడులేని మంటలు- ఇయ్యి కడుపులోని మంటలు
ఆశంటుకున్న మంటలు -మనసంటుకున్న మంటలు
కళ్ళుకాలుతున్న మంటలు -కుళ్లు రేపుతున్న మంటలు

**రత్తి:**

ఏటిసేత్తన్నాడు ? దేవుడేటయ్యి పోయేడు ॥ఏ॥
మంచోళ్ళు కడుపులు -మాడి పోతుంటె
నీతి నాయాలేమొ- ఒణికి పోతుంటె
పెద్దోళ్ళ సేతుల్లొ బొమ్మయ్యి పోయేడా?
పెద్దింటి కాపలా-కుక్కయ్యిపోయేడా?
ఏటి సేత్తన్నాడు- దేవుడేటయ్యి పోయేడు?
మేడొద్దు మిద్దొద్దు- కూడుంటె సాలని
సెమ చేసినందుకు - సెమటూడ్చినందుకు
మొక్కుకుంటె మేము- తప్పయ్యిపోయిందా
మొక్కుతున్నందుకీ కచ్చబూనేడా
ఏటిసేత్తన్నాడు? దేవుడేటయ్యిపోయేడు?



**రత్తి:**

మీబతుకు బళ్ళులాగేటి ఎద్దులం
ఏ సదువు సందె లెరగని మొద్దులం
సూర్యున్ని తాకట్టు పెట్టుకున్నాం
సీకట్లో బతుకుల్ని గడుపుతున్నాం ॥మీ॥



మా రెక్కలకు సాకిరి అలుపు
మా డొక్కల్లో ఆకలి అరుపు
మా బతుకులు సుక మెరగవు
మా యేవున పొద్దొడవదు
మా కళ్ళలో కన్నీటి సుక్కలు
మా గుండెల్లో రగిలేటి మంటలు
మా బతుకులు సుకమెరగవు
మా యేపున పొద్దొడవదు ॥మీ॥
మా గుడిసెల్లో నిదరున్న మురికి
మా రత్తాన నెలవున్న పిరికి
మా బతుకులు సుకమెరగవు
మా యేపున పొద్దొడవదు ॥మీ॥

**రత్తి:**

రావురా మావ ఆరోజులింక
లేవురా సుకాలు మన బతుకులింక ॥రా॥
గొంతులో పుండేసి - పాట మొట్టైనాది
పాముల పక్కన- బతుకుబాద్దైనాది ॥రా॥
సోకాల ఏటిలో - దిన దినము తానాలు
నడిసేటి బాటలో - అడుగడుగు గండాలు
ననుసూతైనీకు - నినుసూతైనాకు
కలతలూ దిగుల్లు - కన్నీటి వరదలు ॥రా॥

**రత్తి:**

పోదాము పోదాము ఓరి మామ



మనము టౌనల్లి పోదాము ఓరి మామ
సుక మసలూ కావరాదు- కన్నీటి వరదలాయె
కామందులు రాబందులు -కరణాలు కసాయోళ్ళు
గూడొదిలి ఊరొదలి- గంగడేల పోయినా
ఊరంతా ఊరితాళ్ళు- పల్లెకింక సెలవుచెప్పి ॥పో॥
కుడువ నింత కూడులేదు- నిలువ నింత నీడలేదు
కట్టానికి కొదువలేదు- కూలై తే కాని రాదు
ఊరాతల బావిలోన-సత్తైందుకు దూకి నాది
ఊరంతా ఉరితాళ్ళు- పల్లెకింక సెలవు చెప్పి ॥పో॥
మావ: పేదోళ్ళు ఎక్కడున్న- పెద్దోళ్ళు అనలేదే
పేద్దోళ్ళు ఎక్కడున్న- పెదోళ్ళుయకాబోరే



**10**

**రత్తి:**

సంటోళ్ళ మనసు - సల్లగుంటాది ॥సం॥
ఆళ్లకళ్లలో నాయం- నిత్తైన మంటాది
అన్నె మెరగనివాళ్ళు- పున్నె మెరగని వాళ్లు
మాయలు మరమాలు-మచ్చు కే లేనోళ్లు సంటోళ్లు ॥సం॥
తోసింది సేత్తారు - తోసిగా అవుతారు
సిని సిన్ని మాటలతో - సత్తాన్ని సెలపుతారు సంటోళ్లు ॥సం॥
కూలోల్లు నాలోల్లు - కులాలు మతాలు
తేడాలే ఎరగరు - మాకైన రూకైన
మేడైన పాకైన - ఒకలాగె సూత్తారు
ఒక్కటనుకుంటారు సంటోళ్లు ॥సం॥

సంటోళ్ళమైపోతే ఎంత బాగుంటాది
సెనిగాడి పీడొదిలి సుకాలి ఒత్తాయి ॥సం॥

**రత్తి:**

గంపేసి మూసినా కోడి కూత్తాది ॥గం॥
కూత యింటూనే పెజలు లేత్తారు
పొడిసేటి పొద్దు ఎరుపు - ఎరుపుతోనెవచ్చు తెలుపు
సీకటిని సంపేసి - గోతులో పాతేసి
ఎలుగులో పోదాము రా రా
మావ ఎలుతురూ చాదాము రా రా ॥గం॥
పుట్టినా పాపడు తెలుపే - ఎదిగేక వత్తాది నలుపు
నలుపును సెరిపేసి - తెలుపుగా సేసేసి
ఎలుగులో పోదాము రా రా
మావ ఎలుతురూ చూదాము రా రా ॥గం॥
పుట్టాక సత్తారు జనము - సచ్చీ బతకాలి మనము
మనిసికి బాటేసి - బాటలో పూలేసి
ఎలుగులో పోదాము రా రా
మావ ఎలుతురు చూదాము రా రా ॥గం॥
మావ: పత్తున్న మనిషికి కూడెట్టలేరు
గుడిలోన రాయికి యిందు లెడతారు
నిన్ను కొట్టిన సొమ్ము - నన్ను కొట్టిన సొమ్ము
ఏడుకొండల పైన ఎంకన్న కిచ్చి
సెమియించమంటూ ఏడు కొంటారు
నా పేగు బాదలు నీపేగు బాదలు
ఆలకించీ వాళ్ళు హాయిగా నవుతారు



సంతోషమయిపోయి పాడుకుంటారు

**రత్తి:**



ఆడికళ్లు రెండుపేల - ఆడుంటే కనరాదా?
ఓ తల్లి కన్నవాద - లేకుంటే యినవేర
ఓ పేరు కాదంట - ఓ రూపు లేదంట
అంతటా వున్నాడంట
గుడులెందు కెలిసేయంట? ॥ఆ॥
సెడ్డోల్లను సంపునంట-మంచోల్లను మరవడంట
సెడ్డోల్లకు మేడలు - అయ్యో
మంచోల్లకు గుడిసెలు ॥ఆ॥
కడుపుమంట కరమంట - కాలితాపు రాతంట
ఈజనమ కట్టమైన - రేయ్ - మరుజనమసుకమంట
బూమంతా అడిదంట - బూరిముక్క కరువంట
ఆ ఎదవను నమ్ముకుంటే - మననోట్లోమట్టంట ॥ఆ॥

**రత్తి:**

మేలుకో- మేలు కోరుకో
ఏలుకో-జగతి నేలుకో ॥మే॥
రాళ్ళకు మొక్కి -రాళ్ళ పాలవకు
నమ్మకాలకు నీవు- నరకేయ బడకు
సుక్కేసి తొంగుంటె-సూరీడు రాడు
తలదించి ఒంగుంటె -సుకాలు రావు ॥మే॥
పిడికిలికి పికిచ్చి - గిజగిజా లాడకు
రంగు కలలాతోటి- బతకేయబోకు
పడకేసి రమ్మంటె -సూరీడు రాడు

అనికేసి కూకేంటే- సూకాలు రావు ॥మే॥
పుట్టుకొత్తన్నాది-నిప్పంటి తరము
కాలిపోతాది-పిడ్డంత, నిజము
రింకేసి వత్తాడు - సూరీడు నాడు
మాడిపోతాదోరి - సినాగాడి మాడు ॥మే॥

**రత్తి:**

గొంతెత్తరా - గొంతెత్తరా ॥గొ॥
నిజమేటో సెప్పగాం
నీతి గుట్టు యిప్పగాం
గొంతెత్తరా - గొంతెత్తరా
తల ఎత్తరా - తల ఎత్తరా ॥త॥
మీసాన్ని మెలిపెడతాం
తల ఎత్తరా - తల ఎత్తరా
పయనించరా- పయనించరా ॥ప॥
అడ్డంకులను దాటుదాం
అందరొకటని చాటుదాం
పయనించరా - పయనించరా
చితి పేర్సరా -సితి పేర్సరా
చింతలను కాలుద్దాం
బతుకులకు ఎలిగిద్దాం
సితి పేర్సరా- చితి పేర్సరా ॥చి॥



**రత్తి:**

మాటమీద మాటొచ్చి అంటున్నాను
మనిసంటె ఎవడని అడుగుతున్నాను ॥మా॥



కళ్ళుంటె, కాళ్ళుంటె
సెవులుంటే, సేతులుంటె మనిసంటె
ఒప్పుకోను నేనొప్పుకోను ॥మా॥
మాటాడే సెత్తుంటె ఏటాడే తెలివుంటే
రాత రాయగలడంటె
కోత కోయగలడంటె మనిసంటె
ఒప్పుకోను నేనొప్పుకోను ॥మా॥
దోచేసే బుర్రంటే దాచేసే పెట్టుంటె
ఇంస పెట్టగలడంటె
ఇసమిచ్చేగలడంటె మనిసంటె
ఒప్పుకోను నే నొప్పుకోను ॥మా॥
మనిసంటె మనసుండాలి;
మనసంతా మంచుండాలి
నాయంగా బతకాలి;
నాడెంగా మసలాలి
మనిసంటె ఆడే
ఒప్పుకోరా నువ్వొప్పుకోరా



**రత్తి:**

కాలమంతా కట్టమామె
సుఖమునకు సూన్యమాయె ॥కా॥
ఎండకాలెం వచ్చెనంట నిలవనింత నీడ దొరకదు
సెమట తప్పనీరు దొరకదు ॥ఎ॥
॥కా॥ వాన కాలం వచ్చెనంట
గుడిసులోన నీటి పరుగులు

గుడిసె చుట్టూ కప్పలరుపులు ॥వా॥

॥కా॥ సీత కాలం వచ్చెనంట

కప్పకోను దుప్పటుండదు

కాచుకోను నిప్పులుండవు ॥సీ॥

॥కా॥ మూడు రుతువుల కూడులేదు

కూడు నడిగే నోరు లేదు

## పదం మీద పదం

**రత్తి:**

పదమాడినామంటె

సత్తాన్ని చెప్పాలి

పదము పదినాళ్ళు ఉండాలి

పదిమంది మెచ్చాలి ॥ప॥

గుండెల్ని కుదపాలి

బండల్ని చిదపాలి

గొంతు గొంతున మన పాట

మారు మోగాలి ॥ప॥

సీకటిని సీల్చాలి

నాయాన్ని నిలపాలి

ఎలుగుకే మన పాట

బాటల్ని సూపాలి ॥ప॥

కన్నీళ్ళు తుడవాలి

కడుపుల్ని తుడవాలి

పేమకి మన పాట

పేదెల్లి పోవాలి ॥ప॥



## ఆశాపూరిత ఆఖరి గీతం



రత్తి: కనుసూపు దూరాన

కనపడత వున్నాడు

ఎర్రగా సూరీడు

ఎదురేగుతున్నాడు

గండాల

గుండాలు దాటేసి

గట్టెక్కి పోతాము

ఊపిరిదీత్తాము ॥క॥

బాదల

బందాలు తెంపేసి

ఒళ్లిరుసు కుంటాము

మునుముందరి కెళతాము ॥క॥

ఏడుపుల

ఏటిని ఈదేసి

సుకంగ వుంటాము

తల తుడుసుకుంటాము ॥క॥

దిన దినము

మనకు దీపాల పండగ

దీపాల ఎలుగులో

దీపాల జనము ॥క॥